సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం । 26 । నవంబర్ । 2024



... మళ్లీ దరఖాస్తులు

పెద్దమ్మగుడి పాలకవర్గ పదవీకాలం గత మార్చి 24న ముగియగా నూతన కమిటీ నియామకానికి నోటిఫికేషన్ జారీ అయింది. 8లో



భూగర్భంలో పని చేయాల్సిందే..

సింగరేణి ఉద్యోగులు తొలి ఐదేళ్లు అండర్ గ్రౌండ్‌లో పని చేసేలా యాజమాన్యం సర్క్యులర్ జారీ చేస్తోందని సమాచారం. 10లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
28° / 15°

జిల్లాలో మంగళవారం పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగానే ఉంటాయి. రాత్రికి మాత్రం చలి తీవ్రత పెరుగుతుంది.

‘హైర్’తో అనర్థాలు !





కొత్తగూడెం బస్టాండ్‌లో అద్దె బస్సులు (ఇన్‌సెట్) ప్రమాదానికి గురై పోలీస్‌స్టేషన్‌లో ఉన్న అద్దె బస్సు

అద్దె బస్సులతో తరచూ ప్రమాదాలు

- అదనపు డ్యూటీలతో డ్రైవర్లపై పనిభారం
- కొరవడుతున్న అధికారుల పర్యవేక్షణ
- ప్రయాణికుల భద్రతను పట్టించుకోని ఆర్టీసీ

చుంచుపల్లి: ఇటీవల కాలంలో ఆర్టీసీ అద్దె బస్సుల ప్రమాదాలు పెరుగుతున్నాయి. కొందరు డ్రైవర్ల నిర్లక్ష్యం ప్రజల ప్రాణాల మీదకు వస్తోంది. అద్దె బస్సులతో జిల్లాలో నెలకు ఒకటి, రెండు చొప్పున ప్రమాదాలు జరుగుతున్నా ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఖమ్మం రీజియన్‌లోని భద్రాచలం, కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు, మధిర, సత్తుపల్లి, ఖమ్మం డిపోల పరిధిలో 230 అద్దె బస్సులు ఉన్నాయి. వీటిలో పల్లె వెలుగు సర్వీసులే ఎక్కువ. నిత్యం తిప్పే కిలోమీటర్లను బట్టి ఈ బస్సులకు డబ్బు చెల్లిస్తారు. ఆర్టీసీకి సైతం ఈ బస్సులతో ఆర్థికంగా కొంత కలిసి వస్తుండడంతో వీటిపైనే దృష్టి పెడుతున్నారు తప్ప ప్రయాణికుల భద్రతను పట్టించుకోవడం లేదు. ఇక అద్దె బస్సుల యజమానులు అనుభవం లేని డ్రైవర్ల చేతికి బస్సులు ఇస్తుండడంతో అవి ప్రజల పాలిట మృత్యు శకటాలుగా మారుతున్నాయి. ప్రతీ రోజు బస్సుల పనితీరుతో పాటు డ్రైవర్ల స్థితిగతులను గమనించాల్సిన డిపో సెక్యూరిటీ సిబ్బంది కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. డిపోల నుంచి బస్సు బయటకు వెళ్లేప్పుడే డ్రైవర్లను పరీక్షించాల్సి ఉండగా సెక్యూరిటీ సిబ్బంది పట్టించుకోవడం లేదని, అందుకే ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు అంటున్నారు. కొందరు అద్దె బస్సుల యజమానులు సెక్యూరిటీ సిబ్బందిని ప్రసన్నం చేసుకోవడంతో డ్యూటీకి వచ్చే డ్రైవర్లకు కనీసం బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు కూడా నిర్వహించడం లేదని తెలిసింది. దీంతో కొందరు డ్రైవర్లు మద్యం తాగి మితిమీరిన వేగంతో బస్సులు నడుపుతూ ప్రమాదాల కారణమవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

శిక్షణ లేని డ్రైవర్లు..

సొంత బస్సుల నిర్వహణ భారం నుంచి తప్పించుకునేందుకు కొన్నేళ్లుగా ఆర్టీసీ అద్దె బస్సులను పెంచుతోంది. ప్రస్తుతం అన్ని డిపోల్లోనూ ఆర్టీసీ కంటే అద్దె బస్సులే ఎక్కువగా ఉన్నాయి. అద్దె బస్సులకు యజమానులే డ్రైవర్లను నియమించుకుంటారు. వారికి ఆర్టీసీ డ్రైవర్ల తరహాలో శిక్షణ ఉండదు. అయితే బస్సు రోడ్డెక్కితే చాలు అనుకుంటున్న ఆర్టీసీ.. అద్దె బస్సు డ్రైవర్లకు శిక్షణ ఇప్పించాలనే విషయాన్ని విస్మరిస్తోంది. ఆటోలు, లారీల డ్రైవర్లు కూడా అద్దె బస్సులు నడుపుతూ ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. యజమానులు తక్కువ వేతనం చెల్లిస్తూ అనుభవం లేని వారిని డ్రైవర్లుగా నియమిస్తున్నారు. డ్రైవర్‌కు లైసెన్స్, బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఉంటే చాలనుకునే ఆర్టీసీ యాజమాన్యం.. మిగితా విషయాలను పట్టించుకోవడం లేదు. నిబంధనల ప్రకారం ఒక్కో అద్దె బస్సుకు ఇద్దరు డ్రైవర్లు ఉండాలి. కానీ చాలా బస్సులు ఒక్క డ్రైవర్‌తోనే నడుస్తున్నాయని సమాచారం. దీంతో ఎక్కువ డ్యూటీలు చేస్తున్న డ్రైవర్లపై మరింత పనిభారం పడుతోంది. ఇది కూడా ప్రమాదాలకు కారణమవుతోంది. నిద్రలేమి, మద్యం మత్తు వంటి కారణాలతో డ్రైవర్లు బస్సులను అదుపుచేయలేక ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు అద్దె బస్సుల నిర్వహణ విషయంలో ప్రత్యేక దృష్టిని సారించాలని పలువురు కోరుతున్నారు.

☛ వైరా మండలం వల్లాపురానికి చెందిన సోదరులు కటికల శోభన్ బాబు, సిల్వ రాజు ద్విచక్రవాహనంపై గత శుక్రవారం ఖమ్మం వెళ్తుండగా అటు నుంచి భద్రాచలం వస్తున్న కొత్తగూడెం డిపో అద్దె బస్సు ఎదురుగా ఢీ కొట్టింది. దీంతో తమ్ముడు సిల్వరాజు(35) అక్కడికక్కడే మృతి చెందగా అన్న శోభన్‌బాబు తీవ్రంగా గాయపడ్డాడు.

☛ జూలూరుపాడు మండలం మాచినపేట పెద్దతండాకు చెందిన లకావత్ నాగేశ్వరరావు భార్య నిర్మలతో కలిసి ఈనెల 22న ద్విచక్రవాహనంపై కొత్తగూడెం నుంచి ఇంటికి వెళ్తుండగా సుజాతనగర్ మండలం నాయకులగూడెం వద్ద భద్రాచలానికి చెందిన ఆర్టీసీ అద్దె బస్సు ఢీ కొట్టింది. దీంతో నాగేశ్వరరావు(43) అక్కడికక్కడే మృతి చెందగా తీవ్రంగా గాయపడిన నిర్మలను కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు. ఈ రెండు ప్రమాదాలూ అద్దె బస్సు డ్రైవర్ల నిర్లక్ష్యంతోనే జరిగాయని స్థానికులు అంటున్నారు.

డ్రైవర్లందరికీ అవగాహన కల్పిస్తున్నాం

ఆర్టీసీలో పనిచేస్తున్న డ్రైవర్లకు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్నాం. అద్దె బస్సులతో ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో యజమానులను పిలిపించి డ్రైవర్లకు శిక్షణతో పాటు తగు సూచనలు చేయాలని డిపో మేనేజర్లకు ఆదేశాలు జారీ చేస్తాం. అద్దె బస్సుల యజమానులు, డ్రైవర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటాం. ప్రతి రోజూ బస్సులతో పాటు డ్రైవర్లను పర్యవేక్షణ చేయాలని సిబ్బందికి సూచిస్తాం.

– ఎ.సరిరామ్, ఆర్ఎం

న్యూస్‌రీల్

వన్యప్రాణుల సంరక్షణలో రాజీ పడొద్దు



మాట్లాడుతున్న డీసీఎఫ్ బాబు

పాల్వంచరూరల్ : వన్యప్రాణుల సంరక్షణలో రాజీ పడొద్దని వైల్డ్‌లైఫ్ ఎఫ్‌డీఓ, డీసీఎఫ్ బి.బాబు అన్నారు. సోమవారం ఆయన గట్టుమల్ల, పునుకుడుచెలకలో నర్సరీలను పరిశీలించారు. అనంతరం డివిజన్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ.. అటవీ భూమి ఆక్రమణకు గురికాకుండా డివిజన్ పరిధిలో గస్తీ పెంచాలని, అడవులు, వన్యప్రాణుల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. నర్సరీలు, ప్లాంటేషన్ పనులు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. విధి నిర్వహణలో ఎవరైనా అలసత్వం వహిస్తే చర్య తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో రేంజర్లు కవిత మాధురి, కనకమ్మ, ఎస్.కిరణ్‌కుమార్, ఎఫ్ఎస్ఓ శ్రీనివాస్, బీట్ అధికారి శోభన్‌బాబు పాల్గొన్నారు.

కేటీపీఎస్‌లో నిలిచిన విద్యుదుత్పత్తి

పాల్వంచ: సాంకేతిక సమస్య తలెత్తడంతో కేటీపీఎస్ 5వ దశలో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. 250 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 9వ యూనిట్‌లో బాయిలర్ ట్యూబ్ లీకేజీ కారణంగా సోమవారం రాత్రి ఉత్పత్తి నిలిపివేశారు. సీఈ ఎం.ప్రబాకర్ రావు ఆధ్వర్యంలో యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టారు.

జాతీయ కరాటే పోటీల్లో జిల్లాకు ఆరు స్వర్ణాలు



పతకాలు చూపిస్తున్న బాలబాలికలు

కొత్తగూడెంఅర్బన్ (కొత్తగూడెంటౌన్): ఈనెల 24న కాజీపేటలో జరిగిన జాతీయ కుంగ్‌ఫూ – కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లాకు ఆరు బంగారు పతకాలు వచ్చాయని ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ యుగంధర్‌రెడ్డి తెలిపారు. బాలుర అండర్ – 10 విభాగంలో 30 కేజీల కటాస్‌లో బి.భానుకృష్ణ, బాలికల విభాగంలో 33 కేజీల కటాస్‌లో ఎంఏ సనా, బాలుర అండర్ – 12 విభాగంలో 36 కేజీల కటాస్‌లో ఎ.జశ్వంత్, 40 కేజీల కటాస్‌లో ఎంఏ ఆయాన్, అండర్ –14లో 42 కేజీల కటాస్‌లో ఎల్.హర్షిత్‌కుమార్, బాలికల అండర్ –14 విభాగంలో 52 కేజీల కటాస్‌లో ఎ.ఆశ్రిత బంగారు పతకాలు సాధించారని వివరించారు. జిల్లా కుంగ్‌ఫూ – కరాటే అకాడమీ ప్రధాన కార్యదర్శి, కోచ్ నీహారిక శిక్షణలో 10 మంది పోటీలకు వెళ్లగా ఆరుగురు బంగారు పతకాలు గెలుచుకున్నారని పేర్కొన్నారు. విజేతలను యుగంధర్‌రెడ్డితో పాటు కరాటే మాజీ క్రీడాకారుడు కాశీహుస్సేన్, ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్.రాజేంద్రప్రసాద్, చైర్మన్ కె.మహీధర్ అభినందించారు.

బాక్సింగ్ టోర్నీలో రజత పతకాలు..

కేయూ ఇంటర్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో జిల్లాకు చెందిన ముగ్గురు రజత పతకాలు సాధించారని కోచ్ సత్యబాబు తెలిపారు. పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన కె.శ్రీసాయి ఉదయ్ 51, 54 కేజీల విభాగంలో, బి.హేమంత్‌కుమార్ 80, 85 కేజీలు, భద్రాచలం డిగ్రీ కాలేజీకి చెందిన వి.వినయ్‌కుమార్ 75, 80 కేజీల విభాగంలో పతకాలు సాధించారని పేర్కొన్నారు. వీరిని బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.ఎల్లయ్య, ఎస్‌బీఐ ఆర్ఎం అర్జున్ అభినందించారు.

‘శివయ్య’కు మహారుద్రాభిషేకం



శివుడికి రుద్రాభిషేకం చేస్తున్న అర్చకులు

భద్రాచలం: కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా పరమేశ్వరుడికి వైభవంగా మహా రుద్రాభిషేకం నిర్వహించారు. శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీ ఉమాసమేత రామలింగేశ్వర స్వామి ఉపాలయంలో సోమవారం మహారుద్రాభిషేకం, జ్వాలా తోరణం తదితర పూజలు జరిపించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి గోదావరి మాతకు నదీ హారతి సమర్పించారు.

రామయ్యకు ముత్తంగి అలంకరణ..

శ్రీ సీతారామచంద్రస్వామి వారి మూలమూర్తులు ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి సోమవారం స్వామివారిని ముత్తంగి రూపంలో అలంకరించడం ప్రత్యేకత. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ధనిక జిల్లాగా మార్చడమే లక్ష్యం



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, పక్కన ఎమ్మెల్యే కూనంనేని, అధికారులు

- సమగ్రాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

చుంచుపల్లి: అభివృద్ధిలో రాష్ట్రంలోనే భద్రాద్రి జిల్లాను ఆదర్శంగా నిలపడమే కాక, ధనిక జిల్లాగా మార్చడమే తమ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం ఆయన చుంచుపల్లి మండలం నందతండా నుంచి వికలాంగుల కాలనీ వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు కొత్తగూడెం, భద్రాచలం ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, తెల్లం వెంకట్రావుతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం కొత్తగూడెంలో రూ.1.50 కోట్లతో నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటోందని, సమకాలిక అంశాలతో పాటు పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలను లైబ్రరీలో అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. గ్రంథాలయాల పునరుద్ధరణకు చర్యలు చేపట్టి ఫర్నిచర్, మౌలిక వసతులు సమకూర్చాలన్నారు. సహజ వనరులకు నిలయమైన జిల్లాలో విద్యా రంగానికి ప్రాధాన్యత ఇస్తూనే, వైద్యం, రహదారుల ఏర్పాటుకు పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. రెసిడెన్షియల్, గురుకుల పాఠశాలల ఏర్పాటుకు గతంలోనే కృషి చేశానని తెలిపారు. కొత్తగూడెం నుంచి ఇల్లెందు మీదుగా హైదరాబాద్‌కు త్వరలోనే మరో జాతీయ రహదారి అందుబాటులోకి రానుందని, పాండురంగాపురం – సారపాక రైల్వే లైన్‌కు కేంద్ర మంత్రితో మాట్లాడుతున్నామని వివరించారు. కొత్తగూడెంలో ఎయిర్‌పోర్ట్‌కు స్థల పరిశీలన ప్రతిపాదనలను కేంద్రానికి పంపించామన్నారు. పోలవరం పూర్తయితే నావిగేషన్‌లోనూ ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, గోదావరిలో నౌకాయానం అందుబాటులోకి వస్తే అతి తక్కువ ధరలకే రవాణా సౌకర్యం కలుగుతుందని చెప్పారు. రైతులు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి పెట్టాలని కోరారు. గరిమెళ్లపాడులో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఫర్ ఆయిల్‌పామ్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటుకు యోచిస్తున్నామని తెలిపారు. కొత్తగూడేన్ని కార్పొరేషన్ చేసేందుకు సీఎం కార్యాలయంలో చర్చించామన్నారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కొత్తగూడెం నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రితో పాటు మంత్రివర్గం సంపూర్ణ సహకారం అందిస్తోందని అన్నారు. ఇప్పటికే ప్రభుత్వం నుంచి పెద్ద ఎత్తున నిధులు రాబట్టి నియోజకర్గంలో మౌలిక సదుపాయాల కల్పనకు పనులు ప్రారంభించినట్లు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయాల చైర్మన్ రియాజ్, ఎస్పీ రోహిత్‌రాజు, అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

ఐటీడీఏ పీఓ రాహుల్



గిరిజనుల సమస్యలు వింటున్న పీఓ రాహుల్

భద్రాచలం: గిరిజనులు ఐటీడీఏలో సమర్పించే దరఖాస్తులను పరిశీలించి.. ఆ సమస్యలు సత్వరమే పరిష్కరించాలని పీఓ బి.రాహుల్ అన్నారు. సోమవారం ఐటీడీఏలోని సమావేశ మందిరంలో జరిగిన గిరిజన దర్బార్‌లో వినతులు స్వీకరించారు. పరిష్కారం నిమిత్తం ఆయా శాఖల అధికారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వివిధ అవసరాల కోసం కార్యాలయాలకు వచ్చే గిరిజనుల పట్ల అధికారులు, సిబ్బంది మర్యాదగా ప్రవర్తించాలని, వారి సమస్యలపై సానుకూలంగా స్పందించాలని సూచించారు. ములకలపల్లి మండలం చంద్రుకుంట గ్రామానికి చెందిన గిరిజనులు తమ గ్రామంలో త్రీ ఫేస్ కరెంటు సరఫరా లేదని ఫిర్యాదు చేశారని, అశ్వారావుపేట మండల ఆసుపాక గ్రామానికి చెందిన గిరిజన మహిళలు ఇళ్ల పట్టాలు కావాలని కోరారని ఆయా సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కాగా, అన్నపురెడ్డిపల్లి మండలం రాయుడుపేటకు చెందిన మత్స్యకారులు చేపల సొసైటీ ఏర్పాటుకు, సత్తుపల్లి మండలం కాకర్లపల్లి గ్రామానికి చెందిన కృష్ణ పంట పొలాలకు త్రీఫేస్ లైన్ కావాలని, బూర్గంపాడు మండలం చెరువు సింగారం గ్రామస్తులు జీపీఎస్ పాఠశాల ఏర్పాటు కావాలని వినతిపత్రాలు అందజేశారు. ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంలు వేతనాలు చెల్లించాలని వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్, ఎస్‌డీసీ రవీంద్రనాథ్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, గురుకులాల ఆర్సీఓ నాగార్జున రావు, ఏఓ సున్నం రాంబాబు, ఎస్ఓ భాస్కరన్, ఉద్యాన వన అధికారి ఉదయ్‌కుమార్, విద్యుత్ ఏపీఓ మునీర్ పాషా, ఆర్ఓఎఫ్ఆర్ డీటీ లక్ష్మీనారాయణ, ఏటీడీఓ అశోక్ కుమార్, మిషన్ భగీరథ ఏఈఈ నారాయణరావు, మేనేజర్ ఆదినారాయణ, జేడీఎం హరికృష్ణ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తేనే గుర్తింపు



రివార్డు గ్రహీతలతో ఎస్పీ రోహిత్‌రాజ్

కొత్తగూడెంఅర్బన్(కొత్తగూడెంటౌన్): క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తే గుర్తింపు ఉంటుందని ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. గంజాయి అక్రమ రవాణా కేసుల్లో నేరస్తులకు శిక్ష పడేలా విధులు నిర్వహించి, డీజీపీ జితేందర్ చేతుల మీదుగా ఇటీవల రివార్డులు అందుకున్న పోలీసులను సోమవారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు బాధ్యతగా విధులు నిర్వర్తిస్తేనే ఉన్నతాధికారుల ప్రశంసలు పొందవచ్చని అన్నారు. కార్యక్రమంలో డీసీఆర్బీ డీఎస్పీ మల్లయ్యస్వామి, రివార్డు గ్రహీతలైన భద్రాచలం సీఐ నాగరాజు రెడ్డి, ఎస్సై శ్రీకాంత్, కోర్టు డ్యూటీ అధికారి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

కలెక్టర్ జితేష్ వి పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కొత్తగూడెంఅర్బన్ (సూపర్‌బజార్): విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనం అందించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. అదనపు కలెక్టర్లు డి.వేణుగోపాల్, విద్యాచందన, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మతో కలిసి సోమవారం ఆయన పలు శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తమ పరిధిలో ఉన్న హాస్టళ్లను జిల్లా, మండలస్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అధికారులు స్వయంగా హాస్టళ్లకు వెళ్లి, అక్కడ నెలకొన్న సమస్యలపై ఫొటోలతో కూడిన నివేదిక అందించాలని ఆదేశించారు. హాస్టళ్లకు సరఫరా అయ్యే బియ్యం నాణ్యతను ఎప్పటికప్పుడు పరీక్షించి రిజిస్టర్లలో సంతకం చేయాలని అన్నారు. బియ్యంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని పౌరసరఫరాల శాఖ అధికారులకు సూచించారు. హాస్టళ్లలో ఉత్సాహంగా ఉండే విద్యార్థులను లీడర్‌గా నియమించాలన్నారు. విద్యార్థుల ప్లేట్లను వర్కర్లు శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. నాణ్యమైన ఆహారం అందించే బాధ్యత ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, వార్డెన్లదేనని స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎలాంటి పొరపాట్లు జరిగినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. హాస్టళ్లలో సోలార్ వాటర్ హీటర్లు పనిచేస్తున్నాయో లేదో తనిఖీ చేయాలన్నారు. ఈనెల 26న రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామ పంచాయతీల్లో ప్రతిజ్ఞ చేయించాలని సూచించారు. అమృత్ సరోవర్ పథకం కింద కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లాలో ఇంటింటి కుటుంబ సర్వే డేటా ఎంట్రీ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.

ఆభరణాల తాకట్టు.. కనికట్టు

- నకిలీ నగలతో బ్యాంకుల్లో రుణాలు
- డీసీసీబీ సహా పలు బ్యాంకులకు ముఠా టోకరా
- ఉన్నతాధికారుల సూచనలతో పోలీసులకు ఫిర్యాదు
- ఆభరణాలను పరిశీలించడంలో నిమగ్నమైన అధికారులు



ఖమ్మంవ్యవసాయం: బంగారం తాకట్టు రుణాల సమయాన మోసాలు జరిగినట్లు బయటపడడంతో బ్యాంకులు, ఫైనాన్స్ కంపెనీల అధికారులు ఉలిక్కిపడ్డారు. కొందరు వ్యక్తులు ముఠాగా ఏర్పడి కొంత కాలంగా బంగారం పూతతో కూడిన కడియాలు, ఇతర ఆభరణాలను బ్యాంకులు, ఫైనాన్స్ కంపెనీల్లో తాకట్టు పెట్టి భారీగా రుణాలు తీసుకున్న వైనం బయటపడింది. ఈ వ్యవహారాన్ని అధికారులు గోప్యంగా ఉంచి.. రుణం తీసుకున్న వారికి సమాచారం ఇచ్చి ఆభరణాలు తీసుకెళ్లాలని సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. కానీ వారు అదిగో.. ఇదిగో అని వాయిదా వేస్తుండడంతో విషయం వెలుగు చూడగా.. అన్ని బ్యాంకుల్లో ఇలాంటి ఆభరణాలు తనఖా పెట్టిన వారు ఒకే ముఠా సభ్యులని గుర్తించారు.

ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల్లో...

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ)కు సంబంధించి జిల్లాలోని వివిధ బ్రాంచ్‌ల్లోనే కాక ఒక గ్రామీణ బ్యాంకు, మరో జాతీయ బ్యాంకు, ఇంకో ఫైనాన్స్ సంస్థలో ఈ తరహా మోసం జరిగినట్లు విశ్వసనీయ సమాచారం. ఒక్కసారిగా గుప్పుమన్న ఈ వ్యవహారంపై బ్యాంకులు, ఫైనాన్స్ కంపెనీలు అప్రమత్తమయ్యాయి. బ్యాంకుల ఉన్నతాధికారులు, ఫైనాన్స్ సంస్థల యజమానుల ఆదేశాలతో ఆయా సంస్థల్లో బంగారం తాకట్టు పెట్టి రుణాలు తీసుకున్న వారి వివరాలు ఆరా తీస్తున్నారు. తాకట్టు పెట్టింది అసలా, నకిలీ బంగరమా అని సోమవారం నుంచి నిర్ధారించడంలో నిమగ్నమయ్యారు.

మొత్తం పరిశీలించండి..

జిల్లాలో నకిలీ బంగారం రుణాల వ్యవహారం కలకలం రేపడంతో సోమవారం పలు బ్యాంకుల ఉన్నతాధికారులు బ్రాంచ్ మేనేజర్లతో అత్యవసర సమావేశాలు నిర్వహించారు. డీసీసీబీ ఖమ్మం ఎస్ఎస్‌టీ, గట్టయ్య సెంటర్, ఏబీ మార్గ్, రోటరీనగర్, హెడ్డాఫీస్ తదితర బ్రాంచ్‌ల్లో ఈ తరహా వ్యవహారం జరిగినట్లు గుర్తించారు. ఈ మేరకు బ్రాంచ్ మేనేజర్లతో సీఈఓ వెంకటఆదిత్య సమావేశమై తొలుత నకిలీ బంగారాన్ని నిర్ధారించాలని సూచించారు. ఇదే తరహాలో గ్రామీణ బ్యాంకులు, వాణిజ్య బ్యాంకుల్లోనూ జరగడంతో ఉన్నతాధికారులు మేనేజర్లను అప్రమత్తం చేశారు.

పోలీసుల దృష్టికి ముఠా వివరాలు..

పలు బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థల్లో నకిలీ బంగారం తాకట్టు పెట్టి రుణాలు తీసుకోగా.. వీరంతా ఒకే ముఠా సభ్యులని పోలీసులు గుర్తించినట్లు సమాచారం. ఆధార్ కార్డులు, ఇంటి చిరునామాలు, ఫోన్ నంబర్ల ఆధారంగా పరిశీలించగా వివరాలు బయటపడినట్లు తెలిసింది. అయితే డబ్బు చెల్లిస్తామంటూ దాటవేస్తున్న ముఠా సభ్యులు.. నకిలీ బంగారమనే విషయాన్ని అధికారులు గుర్తించారని తెలిసి ఫోన్లు స్విచాఫ్ చేసినట్లు సమాచారం. ఇంకొందరు తాము ఉంటున్న ఇళ్లను ఖాళీ చేసినట్లు తెలిసింది. ఖమ్మం నగరంతో పాటు, ఖమ్మం రూరల్, మరికొన్ని మండలాలకు చెందిన కొందరు ఈ ముఠాలో సభ్యులుగా ఉన్నట్లు సమాచారం. వీరి ఆచూకీ గుర్తించేందుకు విచారణలో వేగం పెంచిన పోలీసులు మరోపక్క బ్యాంకుల అధికారులు, ఉద్యోగులు, బంగారం పరీక్షించే అప్రైజర్లను కూడా విచారించాలని నిర్ణయించినట్లు తెలిసింది.

రూ.5కోట్ల మేర బురిడీ..

నకిలీ బంగారాన్ని తాకట్టు పెట్టిన ముఠా సభ్యులు బ్యాంకులు, ఫైనాన్స్ కంపెనీలకు టోకరా వేసినట్లు చర్చ జరుగుతోంది. డీసీసీబీ బ్రాంచ్‌ల్లోనే రూ.30 లక్షల మేర రుణాలు తీసుకున్నట్లు సమాచారం. ఇక ఇతర బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థల్లోనూ పెద్ద ఎత్తున మోసం జరిగిందనే ప్రచారం సాగుతోంది. మొత్తంగా నకిలీ బంగారంతో రూ.5 కోట్ల రుణాలు తీసుకున్నట్లు వివిధ బ్యాంకుల వర్గాల ద్వారా తెలిసింది.

క్లుప్తంగా

హరిబాబుకు ఉత్తమ వ్యాపారవేత్త అవార్డు



హరిబాబును సన్మానిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులు

పాల్వంచ: పాల్వంచకు చెందిన యారో సంస్థల అధినేత తాళ్లూరి హరిబాబు ఉత్తమ వ్యాపారవేత్త అవార్డును అందుకున్నారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లాలో జరిగిన స్వేరో ఏడో జాతీయ కన్వెన్షన్ కార్యక్రమంలో డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అవార్డు అందజేశారు. అనంతరం సన్మానించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ ఏజెన్సీతో పాటు నూతనంగా నర్సింగ్ కళాశాలకు అనుమతి తీసుకొచ్చి ప్రారంభించామని, ప్రవీణ్‌కుమార్ తనను ఎంతగానో ప్రోత్సహించారని తెలిపారు.

పేదల పక్షాన నిలిచేది సీపీఎం

పార్టీ రాష్ట్ర నాయకుడు పోతినేని సుదర్శన్

అశ్వారావుపేటరూరల్: సీపీఎం మాత్రమే పేదల పక్షాన నిలుస్తుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు పోతినేని సుదర్శన్ అన్నారు. సోమవారం మండలంలోని గుంటిమడుగు గిరిజన గ్రామంలో సీపీఎం 9వ మండల మహాసభను కారం సూరిబాబు, తగరం నిర్మల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పోతినేని మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల పేర్లే వేరుగా ఉంటాయని, కానీ పాలనా విధానాలు మాత్రం ఒకేలా ఉంటాయని విమర్శించారు. బడుగు, బలహీన, పేదల పక్షాన నిలబడేది సీపీఎం మాత్రమేనని అన్నారు. ప్రధాని మోదీ తానే దేవుడిగా ప్రచారం చేసుకుంటూ, మతం, దైవం పేరుతో రాజకీయాలు చేస్తున్నట్లు ఆరోపించారు. మత రాజకీయాలతో జాతీయతాభావాన్ని విచ్ఛిన్నం చేస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో కె. పుల్లయ్య, చిరంజీవి, అర్జున్, ప్రసాద్, వెంకటేశ్వరరావు, మురళి పాల్గొన్నారు.

శిశువు విక్రయం కలకలం

నగదు పంపకంలో అక్కాచెల్లెళ్ల మధ్య గొడవ?

ఖమ్మంక్రైం: ఖమ్మం జిల్లా కేంద్రంలో ఓ శిశువును విక్రయించేందుకు చేసిన ప్రయత్నాలు బయటపడ్డాయి. అక్కాచెల్లెళ్లు కలిసి అక్కకు జన్మించిన శిశువును విక్రయించేందుకు ఒప్పందం కుదుర్చుకోగా నగదు పంపకాల్లో తేడాతో... బయటపడినట్లు సమాచారం. ఖమ్మం టుటౌన్ సీఐ బాలకృష్ణ సోమవారం వెల్లడించిన వివరాలు.. కల్లూరు మండలం పుల్లయ్య బంజరులో ఓ మహిళకు జన్మించిన శిశువును అమ్మేందుకు ఆమె చెల్లెలితో కలిసి ప్రయత్నించింది. రోజుల శిశువును తిరుమలాయపాలెం మండలం బీరోలుకు చెందిన మహిళకు విక్రయించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే వచ్చిన డబ్బు నుండి తనకు కొంత వాటా కావాలని చెల్లెలు డిమాండ్ చేసింది. కానీ తన సంతానం అయినందున డబ్బు ఇచ్చేందుకు అక్క నిరాకరించినట్లు తెలిసింది. ఈమేరకు చెల్లెలు మహిళా శిశు సంక్షేమ శాఖ ఉద్యోగులకు సమాచారం ఇవ్వగా వారు పోలీసులకు తెలిపారు. దీంతో నాలుగు రోజుల క్రితం ఖమ్మం కొత్త బస్టాండ్ వద్ద శిశువును విక్రయిస్తున్న వారితో పాటు కొనుగోలుకు వచ్చిన వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఐసీడీఎస్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపర్చామని సీఐ బాలకృష్ణ తెలిపారు. అయితే, శిశువు విక్రయంలో ఎలాంటి నగదు లావాదేవీలు జరగలేదని ఆయన చెప్పడం గమనార్హం.

'పాలకవర్గాని'కి మళ్లీ దరఖాస్తులు..

- మార్చి 24న ముగిసిన పెద్దమ్మగుడి పాలకవర్గ పదవీకాలం
- అప్పుడే నోటిఫికేషన్ జారీ చేయగా, పలువురి దరఖాస్తులు
- ఈ నెల 22న మరోసారి నోటిఫికేషన్ ఇచ్చిన దేవాదాయ శాఖ



పెద్దమ్మతల్లి ఆలయం

పాల్వంచరూరల్: పాల్వంచ మండలంలోని పెద్దమ్మగుడి పాలకవర్గం పదవీ కాలం ఈ ఏడాది మార్చి 24న ముగిసింది. దీంతో నూతన పాలక మండలి నియామకానికి ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ నోటిఫికేషన్ జారీచేయడంతో పదవుల కోసం పోటాపోటీగా 52 మంది దరఖాస్తు చేసుకున్నారు. తాజాగా రెండోసారి ఈ నెల 22న పాలక మండలి నియామకం కోసం ఏసీ వీరస్వామి నోటిఫికేషన్ జారీ చేశారు. దీంతో పదవులు ఆశించే నాయకులు మరోసారి దరఖాస్తు చేసుకోవాలా? గతంలో చేసుకున్న దరఖాస్తులను పరిగణనలో తీసుకుంటారా? అని తర్జనభర్జన పడుతున్నారు.

52 దరఖాస్తులు

జిల్లాలోని భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయం తర్వాత అంతటి భక్తుల రద్దీ, ఆదాయం కలిగిన పాల్వంచ మండలంలోని శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) దేవస్థానం పాలకవర్గ పదవీకాలం మార్చి 24న ముగిసిపోయింది. నూతన పాలకవర్గం ఎన్నిక కోసం దేవాదాయ శాఖ ఫిబ్రవరి 20నే నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో పాల్వంచ, కొత్తగూడెం పట్టణ, మండలాల పరిధిలోని అధికార పార్టీ శ్రేణులు 52మంది దరఖాస్తు చేసుకున్నట్లు అప్పటి ఎండోమెంట్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సులోచన తెలిపారు. అయితే ఆ నోటిఫికేషన్ రద్దు చేసి తాజాగా గత శుక్రవారం ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ వీరస్వామి మరోసారి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆశావహులు 20 రోజుల్లోగా దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. అయితే గతంలో దరఖాస్తులు చేసుకున్న దరఖాస్తులను పరిగణనలోకి తీసుకుంటారా లేక మరోసారి దరఖాస్తు చేసుకోవాలా అని తికమకపడుతున్నారు. కాగా గతంలో ఎన్నడూలేని విధంగా ఈసారి పాలకవర్గం పదవుల కోసం అధిక సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. అధికార పార్టీకి చెందిన పలువర్గాల వారు పాలకవర్గంలో చోటు కోసం తీవ్రప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

పాతవి పరిగణనలోకి తీసుకోం

పెద్దమ్మగుడి నూతన పాలక వర్గం నియామకం కోసం గతంలో జారీ చేసిన నోటిఫికేషన్ రద్దయింది. కమిషనర్ ఆదేశాల మేరకు 22న మరోసారి నోటిఫికేషన్ జారీ చేశాం. నోటిఫికేషన్ జారీ అయిన 20 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. గతంలో చేసుకున్న దరఖాస్తులు పరిగణనలోకి తీసుకోబోం. – వీరస్వామి, ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్, ఖమ్మం

మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యకు నివాళి

మృతదేహాన్ని సందర్శించిన రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల



నివాళులర్పిస్తున్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తదితరులు

ఇల్లెందురూరల్: అనారోగ్యంతో మృతి చెందిన మాజీ ఎమ్మెల్యే ఊకే అబ్బయ్యకు అభిమానులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు సోమవారం అశ్రునయనాలతో వీడ్కోలు పలికారు. ఆదివారం మృతి చెందగా భౌతికకాయాన్ని స్వగ్రామమైన హనుమంతులపహాడ్‌లో ఉంచారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. ఇల్లెందు నియోజకవర్గం అభివృద్ధిలో క్రియాశీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ, కోనేరు చిన్ని, కాంగ్రెస్ నేతలు తుళ్లూరి బ్రహ్మయ్య, పులిగళ్ల మాధవరావు, దొడ్డ డానియల్, ముక్తి కృష్ణ, పూనెం సురేందర్, సూర్నపాక సత్యనారాయణ, ఎట్టి హరికృష్ణ, మోకాళ్ల వెంకటమ్మ, కల్తి పద్మ, సీపీఎం నాయకులు అబ్దుల్ నబి, కిరణ్, సీపీఐ నేతలు సారయ్య, దేవరకొండ శంకర్, కాయం పాపయ్య తదితరులు నివాళులర్పించారు. కాగా అబ్బయ్య అంత్రిమయాత్రకు పలువురు రాజకీయ నాయకులు, గ్రామస్తులు తరలివచ్చారు.

రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో పుట్టా శంకరయ్య

పాల్వంచరూరల్: సీనియర్స్ విభాగంలో ఉమ్మడి జిల్లాస్థాయి ఆర్చరీ జట్లను ఎంపిక చేసినట్లు ఆర్చరీ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి పుట్టా శంకరయ్య తెలిపారు. పాల్వంచ మండలం కిన్నెరసాని స్పోర్ట్స్ స్కూల్‌లో నిర్వహించిన ఎంపిక పోటీలకు పురుషులు 75 మంది, మహిళలు 25 మంది హాజరయ్యారని వెల్లడించారు. ప్రతిభ కనబర్చిన పురుషులు, మహిళలను హైదరాబాద్‌లో డిసెంబర్ 1 నుంచి జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జట్లను ఎంపిక చేసినట్లు తెలిపారు. పురుషుల జట్టుకు కాయం లక్ష్మణ్, ముత్తి చరణ్, బత్తుల అనిల్, కొమరం రాంచరణ్, పి.రవీందర్, ఇర్పా ఆనంద్, ఇర్పా సంపత్, కొమరం అశ్విని దొర, చుంచు వంశీ, తుల్లూరి వెంకటయోగేశ్వర్, కందుకూరి సాయి, నిఖిల్, వంగూరి వర్ధన్ ఎంపిక కాగా, మహిళల జట్టుకు గౌతమి, మధుప్రియ, కల్తి నందుజ, తేజావత్ జమునారాణి, మడకం లక్ష్మి, జూలూరి సంస్కృతి, చెన్నగిరి ఔచిత్య, కనకం లోహిత, షేక్ హస్నా ఎంపికయ్యారని వెల్లడించారు. కాగా, ఎంపిక పోటీల్లో పిజికల్ డైరెక్టర్ ఎస్.సుబ్రమణ్యం, కోచ్‌లు మారెప్ప, కొండి గణేష్, సీనియర్ క్రీడాకారుడు బొజ్జి తదితరులు పాల్గొన్నారు.

15 కేజీల గంజాయి సీజ్



బూర్గంపాడు : వివరాలు వెల్లడిస్తున్న పాల్వంచ సీఐ వినయ్‌కుమార్, బూర్గంపాడు ఎస్ఐ రాజేష్



అశ్వారావుపేట : వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

బూర్గంపాడు: సారపాక పల్లె ప్రకృతి వనం సమీపంలో ఆదివారం రాత్రి పోలీసులు గంజాయిని పట్టుకున్నారు. పాల్వంచ సీఐ వినయ్‌కుమార్ కథనం ప్రకారం.. బూర్గంపాడు ఎస్ఐ రాజేష్ ఆదివారం రాత్రి సారపాక పల్లె ప్రకృతి వనం వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న క్రమంలో కారు అనుమానాస్పదంగా కనిపించింది. దీంతో పోలీసులు ఆపి తనిఖీలు చేపట్టారు. కారులో 15.3 కిలోల గంజాయి ఉండగా, స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్‌తోపాటు వాహనంలో ఉన్న మరో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించారు. ఒడిశా రాష్ట్రంలోని మల్కన్‌గిరి జిల్లా కలిమిలకు చెందిన డ్రైవర్ శ్యామల్ సర్కార్, మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన దీవన్స్‌సింగ్ కుస్వ, మున్ని కుస్వ, రాజ్‌పాల్ కుస్వలు గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్నట్లు తేలింది. చింతూరు నుంచి మధ్యప్రదేశ్‌కు తరలిస్తున్నట్లు విచారణలో అంగీకరించారు. కారు, ఐదు సెల్‌ఫోన్లను వారి నుంచి స్వాధీనం చేసుకున్నారు. నలుగురిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసినట్ల సీఐ తెలిపారు. పట్టుబడ్డ గంజాయి విలువ రూ 3.82 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు.

ఊట్లపల్లి వద్ద 10.4 కిలోలు..

అశ్వారావుపేట: భద్రాచలం నుంచి ఖమ్మానికి అక్రమంగా తరలిస్తున్న గంజాయిని ఖమ్మం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది సోమవారం పట్టుకున్నారు. ఎక్సైజ్ అధికారుల కథనం ప్రకారం.. భద్రాచలం నుంచి పాల్వంచ మీదుగా గంజాయి రవాణాను అధికారులు అడ్డుకుంటున్న నేపథ్యంలో అశ్వారావుపేట మీదుగా తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారంతో ఖమ్మం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సీహెచ్ శ్రీనివాస్, అశ్వారావుపేట ఎక్సైజ్ సీఐ రాజశేఖరరావు, సిబ్బంది మండలంలోని ఊట్లపల్లి వద్ద కాపు కాశారు. ఖమ్మం ముస్తఫా నగర్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు రెండు బైక్‌లపై తరలిస్తున్న 10.4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ములకలపల్లి ఉదయ్, ములకలపల్లి గోపీచంద్‌లను అరెస్ట్ చేయగా, మరో వ్యక్తి పరారయ్యాడు. రెండు బైక్‌లను స్వాధీనం చేసుకుని, నిందితులను రిమాండ్‌కు తరలించారు.

జాగిలంతో పోలీసుల తనిఖీలు



జాగిలంతో తనిఖీలు చేస్తున్న పోలీసులు

టేకులపల్లి: మండలంలోని హనుమాతండా, ముత్యాలంపాడుక్రాస్‌రోడ్, మూడుతండా, లచ్చతండా గ్రామాల్లో పాత గంజాయి నేరస్తుల నివాసాల్లో, ప్రధాన కూడళ్ల, నిర్మానుష్య ప్రదేశాల్లో జాగిలంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ పి.సురేష్ మాట్లాడుతూ గంజాయి, మాదకద్రవ్యాలు అమ్మినా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి కేసుల్లో అరెస్టయిన పలువురు జైలుపాలు అయ్యారని అన్నారు.

విలేకరిపై కేసు నమోదు

ఇల్లెందు: పట్టణంలోని ఓ పీడీఎఫ్ పత్రికా విలేకరిపై కేసు నమోదు కాగా, సోమవారం పోలీసులు రిమాండ్ చేశారు. ఎస్ఐ బి.సూర్య తెలిపిన, ఫిర్యాదులో వివరాల ప్రకారం.. ఈ నెల 23న నూతన సంవత్సరం టార్గెట్ కోసం రూ.లక్ష ఇవ్వాలని ఇల్లెందు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.హర్షవర్ధన్‌ను వీరన్న అనే విలేకరి డిమాండ్ చేశాడు. ఈనెల 5న ఆస్పత్రికి వెళ్లి అక్కడి ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించాడు. ప్రభుత్వాస్పత్రిలో స్కానింగ్ జరుగుతుండగా అక్కడి గదిలోకి అనుమతి లేకుండా వెళ్లి రోగుల ఫొటోలుతీశాడు. ఆస్పత్రి డాక్టర్లు, అక్కడి సిబ్బంది, డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు కలిసి డబ్బులు అందజేయాలని డిమాండ్ చేశాడు. దీంతో సూపరింటెండెంట్ హర్షవర్ధన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు తదితరులు ఎస్పీ రోహిత్ రాజును సదరువ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో వీరన్నపై కేసునమోదు చేసిన పోలీసులు సోమవారం రిమాండ్ చేశారు.

మహిళ ఆత్మహత్య

మణుగూరు టౌన్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... సునీత (35) అనే మహిళ గతంలో గుండాల మండలానికి చెందిన ఓ వ్యక్తిని వివాహం చేసుకుంది. కొంతకాలంగా భర్తను విడిచి చెరువుముందు సింగారం గ్రామంలోని బంధువుల ఇంట్లో ఉంటోంది. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని మృతి చెందింది. పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కోడి పందేల స్థావరంపై దాడి

అశ్వారావుపేటరూరల్: కోడి పందేల స్థావరంపై సోమవారం రాత్రి పోలీసులు దాడి చేశారు. ఎస్సై యయాతి రాజు కథనం ప్రకారం.. మండలంలోని వడ్డెర రంగాపురం గ్రామ సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో పోలీసులు దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.3 వేల నగదు, పది బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. మరికొందరు పందెం రాయుళ్లు పారిపోగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేడు ఉపాధి పనుల జాతర

ఏర్పాట్లు పూర్తి చేసిన డీఆర్‌డీఏ అధికారులు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

చుంచుపల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రజాపాలన పేరిట విజయోత్సవ సంబరాలు నిర్వహిస్తున్నారు. రోజుకో వర్గానికి సంబంధించిన కార్యక్రమాలు చేపడుతున్నారు. మంగళవారం పల్లెల్లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద మహిళల ఉపాధికి, జల సంరక్షణకు, రైతుల సమస్యలను పరిష్కరించేందుకు గ్రామాల్లో పనుల జాతర పేరిట కార్యక్రమాన్ని చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. జిల్లాలో 2.23 లక్షల జాబ్ కార్డులు ఉండగా, 22గ్రామీణ మండలాల పరిధిలోని 481 గ్రామ పంచాయతీల్లో ఉపాధిహామీ పనులు జోరుగా జరుగుతుంటాయి. 4.53 లక్షల మంది కూలీలు పేరు నమోదు చేసుకున్నారు. పనుల జాతరలో భాగంగా ఐదు నెలల్లో జిల్లాలో 50.92 లక్షల పనిదినాలను కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం రూ.75.46 కోట్లు ఖర్చు చేయాలని లేబర్ బడ్జెట్‌ను రూపొందించారు. మహిళా ఉపాధి భరోసా, ఇంకుడు గుంతలు, పశువుల పాకలు, కోళ్ల ఫారాలు, నాడల్ కంపోస్ట్ తయారీ యూనిట్లు, అజోలా తయారీ యూనిట్లు, పర్కులేషన్ ట్యాంకులు, సేద్యపునీటి నిలువ కుంటలు, ల్యాండ్ లెవెలింగ్, రైతులు వ్యవసాయ బావుల వద్దకు వెళ్లేందుకు మట్టి రోడ్ల నిర్మాణం తదితర పనులు చేపట్టనున్నారు. ఒక్కో రకమైన పనిని మండలానికి పది చొప్పున అధికారులు కేటాయించారు. అవసరాన్ని బట్టి పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, సీసీ రోడ్లు, పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లను నిర్మించాలని నిర్ణయించారు. అంచనాలు సైతం సిద్ధం చేశారు. వచ్చే ఏడాది మార్చిలోగా పనులు పూర్తిచేసేలా కార్యాచరణ రూపొందించారు. పనుల జాతరకు ఏర్పాట్లు పూర్తి చేయగా, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరవుతారని డీఆర్‌డీఓ ఎం.విద్యాచందన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

చర్ల: రోడ్డు ప్రమాదంలో సోమవారం ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని దేవరాపల్లికి చెందిన యువకుడు తెల్లం సమ్మయ్య బైక్‌పై భద్రాచలం వైపు నుంచి చర్ల వైపునకు వస్తున్నాడు. అదే సమయంలో చర్ల నుంచి గోవిందరెడ్డికి చెందిన కారు భద్రాచలం వైపు వెళ్తోంది. ఈ క్రమంలో మామిడిగూడెం- గోగుబాక గ్రామాల మధ్యలోని మూలమలుపు వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి కారును ఢీకొట్టింది. దీంతో కారు ముందుభాగం, ద్విచక్రవాహనం నుజ్జునుజ్జయ్యాయి. తెల్లం సమ్మయ్యకు తీవ్ర గాయాలై అపస్మారక స్థితికి చేరగా, చికిత్స నిమిత్తం భద్రాచలం వైద్యశాలకు తరలించారు. యువకుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

బైక్ అదుపు తప్పి ఇద్దరికి...

టేకులపల్లి: మండలం పరిధిలోని కోయగూడెం-లచ్చగూడెం మార్గంలో సోమవారం బైక్ అదుపు తప్పిన ఘటనలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. బోడు కొత్తగూడెం గ్రామానికి చెందిన వట్టం ప్రదీప్, మద్రాస్‌తండాకు చెందిన గుమ్మడి నరేష్ బైక్‌పై వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యారు. స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

క్షీరధారలు మరింతగా..



విజయ డెయిరీ సెంటర్‌లో పాలు విక్రయిస్తున్న మహిళా రైతు

- విజయ డెయిరీ ద్వారా పాల ఉత్పత్తి, సేకరణ
- ఈ ఏడాది జూన్‌తో పోలిస్తే పెరిగిన సేకరణ, బిల్లుల చెల్లింపు
- నేడు జాతీయ పాల దినోత్సవం

ఖమ్మంవ్యవసాయం: మానవాళి జీవనంలో పాలు విడదీయలేని బంధం కలిగి ఉన్నాయి. చిన్నాపెద్ద తేడా లేకుండా పాలు, పాల ఉత్పత్తులను ఇష్టపడతారు. పాలల్లో మన శరీరానికి అవసరమైన కాల్షియం, మెగ్నీషియం, జింక్, ఫాస్ఫరస్, అయోడిన్, ఐరన్, పొటాషియం, ఫోలేట్స్, విటమిన్-ఏ, డీ, రైబోఫ్లేవిన్, విటమిన్ బీ-12 సమృద్ధిగా లభిస్తాయి. దేశంలో శ్వేత విప్లవానికి పితామహుడు, పాల ఉత్పత్తిని ప్రోత్సహించిన వర్గీస్ కురియన్‌ను 'మిల్క్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా అని పిలుస్తారు. ఆయన జయంతి అయిన నవంబర్ 26న ఏటా జాతీయ పాల దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. ఈ మేరకు జిల్లాలో విజయ డెయిరీ ద్వారా పాల సేకరణ, పాడిరైతులకు ప్రోత్సాహకాలపై కథనం.

పాల ఉత్పత్తి, సేకరణపై దృష్టి

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో విజయ డెయిరీ ద్వారా పాడి రైతులను ప్రోత్సహిస్తూనే సేకరణ చేపడుతున్నారు. వ్యవసాయపరంగా అభివృద్ధి చెందడం, నీటి వనరులు ఉండడంతో రైతులు పాడిపశువుల ముందుకొస్తున్నారు. తద్వారా ఉమ్మడి ఖమ్మం వ్యాప్తంగా విజయ డెయిరీ ద్వారా నిత్యం 12 వేల లీటర్ల పాలను సేకరిస్తున్నారు. డెయిరీ సామర్థ్యంతో పోలిస్తే ఇది తక్కువ అయినప్పటికీ గతంతో పరిశీలిస్తే మెరుగుపడిందనే చెప్పాలి. అయితే ఉమ్మడి జిల్లాలో ప్రైవేటు డెయిరీలు పుట్టగొడుగుల్లా వెలిసి రైతుల నుంచి పాల సేకరణ చేపడుతున్నాయి. దీంతో ప్రభుత్వ రంగ సంస్థ అయిన విజయ డెయిరీ బలోపేతానికి యాజమాన్యం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే ఇటీవల అనుభవం ఉన్న అధికారులు, ఉద్యోగులను నియమించడంతో రైతులకు అవగాహన కల్పిస్తూ పాల సేకరణ పెంపుపై దృష్టి సారించారు.

ఈ ఏడాది జూన్ - నవంబర్‌లో డెయిరీ ప్రగతి

అంశం	జూన్	నవంబర్
బల్క్ మిల్క్ సెంటర్స్	06	06
సేకరణ (లీటర్లలో)	5,500	12,000
విక్రయాలు (లీటర్లలో)	500	7,000
ఎంపీసీఎస్ సెంటర్లు	47	51
ఎంపీఏసీ సెంటర్లు	195	205
డెయిరీ పార్లర్లు	02	05
బిల్లుల చెల్లింపు (నెలకు)	రూ.80.50 లక్షలు	రూ.1.42 కోట్లు

ప్రగతిబాటలో...

డెయిరీకి సంబంధించి గత కొన్నేళ్లలో జరిగిన పరిణామాలను పరిశీలించిన యాజమాన్యం సీనియర్ అధికారులకు కేటాయించింది. ప్రక్షాళనలో భాగంగా తీసుకున్న ఈ చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. కొద్దినెలలుగా పాల సేకరణ గణనీయంగా పెరగడంతో పాల సేకరణ కేంద్రాలను పెంచుతున్నారు. అంతేకాక అవకాశం ఉన్న చోట డెయిరీ పార్లర్లను ఏర్పాటుచేస్తుండడంతో విక్రయాలు కూడా పెరుగుతున్నాయి.

పాలు ప్రయోజనాలు

పాలు పిల్లలకు ప్రధాన ఆహారం. చిన్న పిల్లల ఎముకల పటిష్టతలో పాలు ఉపయోగపడతాయి. దంతాలు, మెదడుకు కూడా ముఖ్యమైన కాల్షియాన్ని అందిస్తాయి. ఒత్తిడి, నిద్రలేమిని తొలగిస్తాయని, శక్తిని ఇవ్వడమే కాక జీర్ణక్రియను పెంచి మలబద్ధకాన్ని దూరం చేస్తాయని వైద్యులు చెబుతారు.

పాడికి సమృద్ధిగా వనరులు



ఈ జిల్లాలో పాడికి సమృద్ధిగా వనరులు ఉన్నాయి. వాతావరణం, నీటి వనరులు, పచ్చిక బయళ్లు పాడి పశువుల పెంపకానికి.. తద్వారా పాడి ఉత్పత్తికి ఉపయోగపడతాయి. కొందరు రైతులు ఈ వనరులను సద్వినియోగం చేసుకుంటూ పాడి ఉత్పత్తి ద్వారా ప్రయోజనాలను పొందుతున్నారు. ఈ విషయంలో విజయ డెయిరీ ద్వారా మరింత అవగాహన కల్పించాలని నిర్ణయించాం. – మోహనమురళి, డీడీ, విజయ డెయిరీ, ఉమ్మడి ఖమ్మం జిల్లా

గాయపడిన వ్యక్తి మృతి



కిరణ్ (ఫైల్)

భద్రాచలంఅర్బన్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి ఆదివారం రాత్రి మృతి చెందాడు. వివరాలు ఇలా.. భద్రాచలం బ్రిడ్జి పాయింట్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న రాజేష్, కిరణ్‌లు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించగా, రాజేష్ అప్పటికే మృతి చెందాడు. మెరుగైన వైద్యం కోసం కిరణ్‌ను ఖమ్మం తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. కాగా ప్రమాదానికి సంబంధించిన సీసీ కెమెరా ఫుటేజీ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

చికిత్స పొందుతున్న పోస్టల్ ఉద్యోగి...



రామరాజు (ఫైల్)

ములకలపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ పోస్టల్ ఉద్యోగి చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఎస్సై కిన్నెర రాజశేఖర్ కథనం ప్రకారం.. ములకలపల్లిలో నివసించే భాస్కరిణి రామరాజు (57) పాగళ్లపల్లిలో అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ (ఏబీపీఎం)గా విధులు నిర్వహిస్తున్నాడు. రోజూలాగానే శుక్రవారం విధులకు హాజరై తిరిగి సహఉద్యోగితో కలిసి బైక్‌పై ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో కంపగూడెం ప్రభుత్వ పాఠశాల సమీపంలో వీరి బైక్‌ను ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొట్టింది. ప్రమాదంలో రామరాజుకు తీవ్రగాయాలు కాగా, ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య సుబ్బలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గడ్డి మందు తాగిన వివాహిత...

పాల్వంచరూరల్: కడుపు నొప్పి తాళలేక గడ్డిమందు తాగిన వివాహిత మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని మందరెకలపాడు గ్రామానికి చెందిన కాటి సాంబలక్ష్మి(43) రెండేళ్ల నుంచి కడుపు నొప్పి, థైరాయిడ్ సమస్యతో బాధపడుతోంది. నొప్పి తట్టుకోలేక ఆదివారం ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి పాల్వంచ ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి కొత్తగూడెం ఆస్పత్రికి తరలించగా, చికిత్స అందించారు. అక్కడి నుంచి ఖమ్మం తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలు భర్త కాటి నర్సింహారావు ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.సురేష్ తెలిపారు.

ఓ కరపత్రం 'ఏడు'పు కథ!

సెకీతో ఒప్పందాన్ని 7 గంటల్లోనే ఆమోదించారంటూ ఈనాడు వక్రీకరణ ● వాస్తవాలను దాచిపెట్టి విషం చిమ్మడమే అసలు లక్ష్యం



7 గంటల్లోనే సెకీ దస్త్రాన్ని ఆమోదించారంటూ 'ఈనాడు' రాసిన అబద్ధపు కథనం



- సేద్యానికి పగలు 9 గంటల విద్యుత్ కోసం సోలార్ ఎనర్జీ కార్పొరేషన్‌తో ఒప్పందం
- యూనిట్ రూ.2.49 చొప్పున ఏటా 7 వేల మెగావాట్లు కొనుగోలు
- మంత్రివర్గం నిర్ణయాలను వెల్లడించిన మంత్రి పేర్ని నాని

» వ్యవసాయానికి పగటి పూట తొమ్మిది గంటలు నిరంతరాయంగా నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను సరఫరా చేసేందుకు ఏటా 7 వేల మెగావాట్ల విద్యుత్‌ను యూనిట్ రూ.2.49కే కొనుగోలు చేస్తూ కేంద్ర ప్రభుత్వ సంస్థ సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాతో ఒప్పందానికి ఆమోదం. 25 ఏళ్ల పాటు ఈ సంస్థ విద్యుత్‌ను సరఫరా చేయనుంది.

సెప్టెంబర్ 15న సెకీ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాస్తే అనేక చర్చలు, అధ్యయనాలు అనంతరం అక్టోబర్ 28న మంత్రి మండలి ఆమోదించింది. అందుకు సాక్ష్యం ఇదిగో..

సాక్షి, అమరావతి: వక్రీకరణలే పరమావధిగా పచ్చి అబద్ధాలను కుమ్మరిస్తున్న ఈనాడు.. గత సర్కారు ఏడు గంటల్లోనే సెకీతో ఒప్పందాన్ని క్యాబినెట్ భేటీలో ఆమోదించుకుందంటూ మరోసారి బుకాయించింది. రాష్ట్ర రైతాంగానికి ఉచిత విద్యుత్తుకు ఢోకా లేకుండా ప్రయోజనం జరుగుతోంటే రూ.లక్ష కోట్లకుపైగా భారం అంటూ అసత్య ఆరోపణలు చేసింది. ఈ ఒప్పందానికి ఐఎస్‌టీఎస్ చార్జీలు వర్తించవని తెలిసినా పదేపదే విషం చిమ్ముతూ అదే ఒరవడి కొనసాగిస్తోంది. నిజానికి రెండున్నర నెలల పాటు సుదీర్ఘ కసరత్తు.. లాభనష్టాల బేరీజు.. నిపుణుల కమిటీ పరిశీలన.. మంత్రివర్గంలో చర్చ.. చివరిగా విద్యుత్తు నియంత్రణ మండలి గ్రీన్ సిగ్నల్.. ఇన్ని దశలు దాటి ప్రక్రియలన్నీ పక్కాగా పాటించాకే సెకీతో ఒప్పందం కార్యరూపం దాల్చింది. వ్యవసాయ ఉచిత విద్యుత్తుకు ఢోకా లేకుండా పాతికేళ్ల పాటు అత్యంత చౌకగా సౌర విద్యుత్‌ను అందిస్తామని, అంతరాష్ట్ర ప్రసార చార్జీల నుంచి సైతం మినహాయింపు కల్పిస్తామని 2021 సెప్టెంబర్ 15న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సెకీ స్వయంగా ప్రతిపాదిస్తూ లేఖ రాసింది. దీనిపై సాధ్యమైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలని సెకీ కోరడంతో 2021 సెప్టెంబర్ 16న అప్పటికే ముందుగా నిర్ణయించిన తేదీ ప్రకారం కేబినెట్ సమావేశంలో దీన్ని టేబుల్ ఐటమ్‌గా ప్రవేశపెట్టారు. అంతేగానీ సెకీ లేఖపై అప్పటికప్పుడు నిర్ణయం తీసుకోవటం కోసంగానీ.. ఆమోదించడం గానీ జరగలేదు. ముఖ్యమైన విషయాలు అత్యవసరంగా క్యాబినెట్ దృష్టికి వచ్చినప్పుడు టేబుల్ ఐటమ్ కింద ప్రవేశపెట్టడం పరిపాటి, ఆనవాయితీ. అందులో ఏం తప్పు ఉంది? ఈ క్రమంలో దీనిపై లోతైన అధ్యయనానికి కమిటీని నియమించి క్యాబినెట్‌కు నివేదిక ఇవ్వాలని గత ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ఈ దశలన్నీ పూర్తయ్యాకే 2021 అక్టోబర్ 28న క్యాబినెట్ సమావేశంలో ఒప్పందానికి ఆమోదం లభించింది. ఏపీఈఆర్‌సీ నుంచి కూడా అనుమతి తీసుకోవాలని డిస్కమ్‌లను నిర్దేశించారు. అంతేగానీ ఈనాడు చెబుతున్నట్లుగా హడావుడిగా ఒప్పందాన్ని ఆమోదించాలనుకుంటే అంతకుముందు జరిగిన మంత్రివర్గ సమావేశంలోనే ఆమోదించి ఉండాలి కదా? నెలల తరబడి ఎందుకు ఆగుతారు? ఇలా సుదీర్ఘంగా చర్చలు, పలు ప్రక్రియలు ముగిశాకే 2021 డిసెంబర్ 1న సెకీతో ఒప్పందం జరిగింది.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

అర్థ రహిత ఆరోపణలు..

2021 సెప్టెంబర్ 15న సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ (సెకీ) యూనిట్ రూ.2.49కే సౌర విద్యుత్‌ను సరఫరా చేస్తామని చెప్పింది. నిజానికి ఈ ధర అప్పటి వరకు ఇతర మార్గాల్లో విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లకు వస్తున్న విద్యుత్ ధరల కంటే చాలా తక్కువ. పైగా కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రోత్సాహం కింద 'అంతర్ రాష్ట్ర ప్రసార ఛార్జీల (ఐఎస్‌టీఎస్) నుంచి మినహాయింపు'కూడా ఈ ఒప్పందానికి వర్తింపజేస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వానికి సెకీ లేఖ రాసింది. అయితే సెకీ నుంచి విద్యుత్‌ను తీసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం 7 గంటల వ్యవధిలోనే అంగీకరించిందని, రాష్ట్రానికి వచ్చే ప్రయోజనాలేమిటి? అంత విద్యుత్ వినియోగించగలమా? లాంటి అంశాలను పరిగణలోకి తీసుకునేందుకు తగినంత సమయం కేటాయించలేదని ఈనాడు మొదటి ఆరోపణ చేసింది. సెకీ ప్రతిపాదన వల్ల ప్రజలపై రూ.1,10,000 కోట్ల మేర ఆర్థిక భారం పడుతుందని ఆలోచించలేదనేది రెండో ఆరోపణ. కానీ ఈ రెండూ పచ్చి అబద్ధాలే. ప్రజల్ని తప్పుదోవ పట్టించేందుకు అల్లుకున్న కట్టుకథలు మినహా ఇందులో ఏ ఒక్కటీ వాస్తవం కాదు.

రెండున్నర నెలలు.. విశ్లేషించాకే అనుమతి..

సౌర విద్యుత్తుకు సంబంధించి పలు ప్రయోజనాలను కల్పిస్తూ 2021 సెప్టెంబర్ 15న సెకీ నుంచి ప్రతిపాదన వచ్చింది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సెకీ, రాష్ట్ర ప్రభుత్వం, డిస్కంల మధ్య విద్యుత్ విక్రయ ఒప్పందం (పవర్ సేల్ అగ్రిమెంట్) 2021 డిసెంబర్ 1న జరిగింది. అంటే ప్రతిపాదనకు – ఒప్పందానికి మధ్య రెండున్నర నెలల కంటే ఎక్కువ వ్యవధి ఉంది. ఆ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎవరితోనూ ఎలాంటి ఒప్పందాలు కుదుర్చుకోలేదు. ఈ రెండున్నర నెలల్లో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, సెకీ మధ్య పలు పర్యాయాలు సంప్రదింపులు జరిగాయి. సెకీ ప్రతిపాదనలో లోటుపాట్లను, ఒప్పందం వల్ల కలిగే లాభనష్టాలను లోతుగా విశ్లేషించారు. అంతేకాకుండా ఈ ప్రతిపాదనకు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్‌సీ) ఆమోదాన్ని 2021 నవంబర్ 8న కోరారు. 2021 నవంబర్ 11న ఏపీఈఆర్‌సీ నుంచి దీనికి ఆమోదం లభించింది. సెకీ ప్రతిపాదనపై రాష్ట్ర ప్రభుత్వం చేసిన కసరత్తు, అందుకోసం తీసుకున్న సమయం రెండున్నర నెలలకంటే ఎక్కువ ఉన్నట్లు ఇంత స్పష్టంగా కనిపిస్తున్నా ఈనాడు మాత్రం 7 గంటల్లోనే ఆమోదం తెలిపేశారంటూ పచ్చి అబద్ధాలను ప్రచురించింది.

క్షుణ్నంగా సుదీర్ఘ కసరత్తు..

సెకీ ఒప్పందాన్ని అమలు చేయాలనే నిర్ణయాన్ని మంత్రి మండలి సెప్టెంబర్ 16వ తేదీన తీసుకుందని ఈనాడు మరో ఆరోపణ చేసింది. వాస్తవం ఏమిటంటే మంత్రి మండలి సమావేశాన్ని అప్పటికప్పుడు నిర్ణయించలేదు. అంతకుముందు వారం రోజుల క్రితమే ఆ సమావేశం షెడ్యూల్ ఖరారైంది. అంటే.. కేబినెట్ సమావేశం తేదీపై నిర్ణయం తీసుకునే నాటికి సెకీ నుంచి ఎలాంటి ప్రతిపాదన రాష్ట్ర ప్రభుత్వానికి రాలేదు. సమావేశానికి ఒక రోజు ముందు మాత్రమే సెకీ లేఖ అందింది. తమ లేఖపై వీలైనంత త్వరగా స్పందన తెలియజేయాలని ఆ లేఖలో సెకీ కోరింది. అయితే మొత్తం ప్రక్రియకు కనీసం 2 నుంచి 3 నెలల సమయం పడుతుందనే వాస్తవాన్ని గ్రహించిన రాష్ట్ర ప్రభుత్వం.. సెకీ కోరినట్లుగా ప్రక్రియను ఆలస్యం చేయకూడదని భావించి తగిన మార్గదర్శకాల కోసం 2021 సెప్టెంబర్ 16న మంత్రి మండలి సమావేశంలో ఈ అంశాన్ని టేబుల్ ఐటమ్‌గా ఉంచింది. ఈ ప్రతిపాదనపై మరింత క్షుణ్నంగా అధ్యయనం చేయాలని రాష్ట్ర ఇంధన శాఖను నాటి సమావేశంలో మంత్రి మండలి ఆదేశించింది. సెకీ ప్రతిపాదనను పరిశీలించేందుకు ఆంధ్రప్రదేశ్ పవర్ కోఆర్డినేషన్ కమిటీ(ఏపీపీసీసీ) చైర్మన్ నేతృత్వంలో ఒక కమిటీని కూడా ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో కమిటీ సభ్యులు పలుదఫాలు సెకీ అధికారులతో చర్చలు జరిపారు. అనంతరం 2021 అక్టోబర్ 25న సెకీ ప్రతిపాదనకు అనుకూలంగా కమిటీ తన సిఫార్సులను ప్రభుత్వానికి సమర్పించింది. దీంతో అక్టోబర్ 28న జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆ సిఫార్సులను మంత్రి మండలి ముందు ఉంచారు. ఏపీఈఆర్‌సీ అనుమతికి లోబడి సెకీతో పీఎస్‌ఏ అమలును ఆమోదించాలని మంత్రి మండలి నిర్ణ యం తీసుకుంది. దీంతో 2021 నవంబర్ 8న ఏపీఈఆర్‌సీ ఆమోదం కోసం డిస్కంలు దరఖాస్తు చేశా యి. 2021 నవంబర్ 11న ఏపీఈఆర్‌సీ ఆమోదం పొందిన తర్వాతే 2021 డిసెంబర్ 1న ఒప్పందం జరిగింది. కాబట్టి టీడీపీ, ఈనాడు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, దురుద్దేశపూర్వకంగా చేస్తున్నవని స్పష్టం అవుతోంది.

ఎన్నిసార్లు చెప్పినా.. పాడిందే పాట!

ఇక ఈనాడు చేసిన రెండో ఆరోపణపై వాస్తవానికి స్పందించడం కూడా అనవసరం. ఎందుకంటే సెకీతో ఒప్పందం వల్ల ఐఎస్‌టీఎస్ చార్జీలు వర్తించవని డిస్కంలు అనేకసార్లు ఆధారాలతో సహా చెప్పినప్పటికీ ఈనాడు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ ఆ భారాన్ని రాష్ట్రం భరించాల్సి వస్తుందంటూ మళ్లీ అదే అబద్ధాన్ని వల్లె వేసింది. ఈ ప్రాజెక్టు కోసం ప్రత్యేక ఇన్సెంటివ్ కింద ఐఎస్‌టీఎస్ చార్జీల నుంచి మినహాయింపును కేంద్ర ప్రభుత్వం అందించిందని సెకీ తన ప్రతిపాదనలో స్పష్టంగా పేర్కొంది. ఐఎస్‌టీఎస్ చార్జీలు వర్తించవని, దీని నుంచి మినహాయింపు లభిస్తుందని తెలిపే లేఖను స్పష్టత కోసం అనేకసార్లు ప్రజలకు అందుబాటులో ఉంచినా టీడీపీ కరపత్రంలా ఈనాడు అబద్ధాలను ప్రచారం చేస్తూనే ఉంది.

'సెకీ'ఒప్పందంతో లాభాలివీ..

- కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ) యూనిట్ రూ.2.49కే సోలార్ విద్యుత్తు అందచేస్తామంటూ తనకు తానుగా రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదన పంపింది.
- ఈ ప్రతిపాదనకు ఏపీ అంగీకరించడం వల్ల 25 ఏళ్ల పాటు ఐఎస్‌టీఎస్ చార్జీల నుంచి మినహాయింపు లభిస్తుందని 2021 సెప్టెంబర్ 15న రాష్ట్ర ప్రభుత్వానికి రాసిన లేఖలో సెకీ స్పష్టం చేసింది.
- ఈ చారిత్రక ఒప్పందం వల్ల రాష్ట్ర ఖజానాకు ఏటా రూ.3,750 కోట్లు చొప్పున 25 ఏళ్ల పాటు దాదాపు రూ.లక్ష కోట్ల మేర విద్యుత్తు భారం నుంచి ఆర్థిక ప్రయోజనం చేకూరుతుంది.
- ఐఎస్‌టీఎస్ చార్జీల నుంచి మినహాయింపు అనేది మరే ఇతర ప్రాజెక్ట్‌కి దక్కని చాలా కీలకమైన ప్రయోజనం. ఇతర రాష్ట్రంలో ఉన్న సోలార్ పవర్ ఉత్పాదక కేంద్రం నుంచి విద్యుత్ సరఫరా కోసం మరే ఇతర సంస్థతో ఒప్పందం చేసుకుంటే మన రాష్ట్రం ఐఎస్‌టీఎస్ ఛార్జీలను చెల్లించాల్సి వచ్చేది. అప్పుడు అది చాలా భారంగా మారుతుంది. ప్రతి నెలా మెగావాట్‌కు సుమారు రూ.4 లక్షలు దానికే ఖర్చవుతుంది.
- రాష్ట్ర డిస్కంలు మునుపెన్నడూ ఇంత తక్కువ ధరకు సౌర విద్యుత్‌ను కొనుగోలు చేసిన దాఖలాలు లేవు.
- ఇది కేంద్ర సంస్థ సెకీతో గత ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందం. ఇందులో మూడో వ్యక్తి ప్రమేయానికి తావే లేదు. అలాంటప్పుడు ఇక లంచాలకు ఆస్కారం ఎక్కడుంటుంది?
- టీడీపీ హయాంలో కుదుర్చుకున్న అధిక ధరల పీపీఏలతో పోలిస్తే సెకీతో సగం కంటే తక్కువ ధరకే ఒప్పందం కుదిరింది.

జిల్లా వార్తలు

ఆటోవాలా.. ఆదర్శం

- గర్భిణులు, వృద్ధులు, దివ్యాంగులకు ఉచిత ప్రయాణం
- అభినందనలు అందుకుంటున్న ముజాహిద్



ఆటో వద్ద మహ్మద్ ముజాహిద్

ఇల్లెందు: ఇల్లెందు పట్టణంలోని స్టేట్ ఫిట్ బస్తీకి చెందిన 45 ఏళ్ల దివ్యాంగుడైన ఆటో డ్రైవర్ మహ్మద్ ముజాహిద్ తన ఆటోలో దివ్యాంగులు, వృద్ధులు, గర్భిణులకు ఉచిత ప్రయాణం కల్పిస్తుంటాడు. తన లాంటి దివ్యాంగులు పడే అవస్థలను చవి చూసిన ఆయన వారి కోసం ఎదో ఒకటి చెయ్యాలని తలంచాడు. ముఖ్యంగా పేదలు ఆటోలో ఉచితంగా ప్రయాణించేలా సదుపాయం కల్పించాడు. అంతే కాదు గర్భిణులు, వృద్ధులు కూడా ఆటో ఎక్కితే పైసా తీసుకోకుండా సర్వీస్ చేస్తాడు. ఫైనాన్స్ ద్వారా ఆటో కొనుగోలు చేసిన ముజాహిద్ అటు ఫైనాన్స్ చెల్లిస్తూ ఇటు పేదలకు ఉచిత సేవలు అందిస్తున్నాడు. ఇక తనకు లభించే దివ్యాంగుల పింఛన్‌ను కుటుంబ అవసరాలకు వినియోగిస్తున్నాడు. గత 20 ఏళ్లుగా ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న ముజాహిద్ ఇటీవల తన ఆటో వెనుక భాగంలో దివ్యాంగులు, గర్భిణులు, వృద్ధులకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నట్లు రాయించి, ఫోన్ నంబర్ కూడా ప్రదర్శించారు. ఎవరైనా పేదలు ఫోన్ చేస్తే చాలే అర్ధరాత్రి అయినా వెళ్లి ఉచిత ప్రయాణం కల్పిస్తారు. ముజాహిద్‌కు భార్య, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఇటీవల కుమార్తె వివాహం జరిపించగా, కుమారుడు డిగ్రీ పూర్తి చేశాడు. ఇదిలా ఉండగా పట్టణంలోని పలు షూ షాప్‌లలో నెలల తరబడి అమ్ముడుపోని చెప్పులు ఉంటే అడిగి వాటిని పేదలకు పంపిణీ చేస్తుండడం విశేషం.

భూగర్భంలో పనిచేయాల్సిందే...



గనిలో పని చేస్తున్న కార్మికులు

- సింగరేణి కొత్త ఉద్యోగులకు తప్పనిసరి నిబంధన
- సర్క్యులర్ విడుదల చేయనున్న యాజమాన్యం
- ఐదేళ్లు అండర్ గ్రౌండ్‌లో పనిచేశాకే సర్ఫేస్(ఉపరితలం)లోకి బదిలీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో పెచ్చరిల్లి తున్న రాజకీయ జోక్యాన్ని తగ్గించడం, లక్ష్యం మేరకు ఉత్పత్తి సాధించడమే ధ్యేయంగా యాజమాన్యం సంస్కరణలకు శ్రీకారం చుడుతోంది. ఇందులో భాగంగా కొత్త ఉద్యోగులెవరైనా తొలి ఐదేళ్లు అండర్ గ్రౌండ్(భూగర్భ గనులు)ల్లో పనిచేసేలా సర్క్యులర్ రూపొందిస్తున్నట్లు తెలిసింది. ఫలితంగా ఏళ్ల తరబడి భూగర్భంలో పని చేస్తున్న వారిని సర్ఫేస్(కార్యాలయాలు)కు బదిలీ చేసే అవకాశం కలుగుతుంది. గతంలో ఈ విషయమై నిబంధనలు ఉన్నా కొన్నేళ్లుగా రకరకాల కారణాలతో అమలుకు నోచుకోవడం లేదు. ఈనేపథ్యాన ఇంకొంత షరతులతో పటిష్టంగా సర్క్యులర్ జారీ చేసేందుకు యాజమాన్యం సిద్ధమవుతున్నట్లు సమాచారం.

కొత్త ఉద్యోగులు సగం మంది సర్ఫేస్‌లోనే...

సింగరేణిలో 2018 నుండి సుమారు 110 మెడికల్ బోర్డులు నిర్వహించారు. ఇందులో 18 వేల మంది వరకు కార్మికులు ఇన్‌వాలిడేషన్ అయ్యారు. దీంతో వారి వారసుల్లో 16 వేల మంది మేర(మహిళలు, పురుషులు) సింగరేణిలో ఉద్యోగాలు దక్కాయి. తొలుత వీరిని బదిలీ వర్కర్లుగా చేర్చుకోగా.. తప్పనిసరిగా అండర్ గ్రౌండ్‌లో పనిచేయాల్సి ఉంటుంది. కానీ 80 శాతం మంది డిగ్రీ, పీజీ, బీటెక్, ఎంటెక్, ఎంబీఏ చదివిన వారు ఉన్నారు. దీంతో అండర్‌గ్రౌండ్ పని చేయకుండా పరపతి ఉపయోగించుకుంటూ శిక్షణ పూర్తికాకుండానే సర్ఫేస్ విభాగాల్లో ఉద్యోగాలు సంపాదించారు. కొందరు నేరుగా, ఇంకొందరు డిప్యూటేషన్‌పై భూగర్భ గనుల ముఖం చూడకుండానే ఇతర విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. తద్వారా గనుల్లో పనిచేసే వారిపై భారం పెరగడం.. వారంతా ఏళ్ల తరబడి గనుల్లోనే విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈవిషయమై కొన్ని ఏరియాల్లో గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం కానరావడం లేదు.


తప్పుడు విధానాల్లో అలవెన్స్‌లు

సింగరేణిలో కొందరు అధికారుల పనితీరు కార్మికుల పాలిట శాపంగా మారుతుందనే విమర్శలు ఉన్నాయి. అండర్ గ్రౌండ్‌లో పనిచేసే ఉద్యోగి ఏదైనా కారణంతో సర్ఫేస్‌లో విధులు నిర్వర్తిస్తే ఆ విభాగం గణాంకాల ఆధారంగానే వేతనం తీసుకోవాలి. కానీ సర్ఫేస్ జీతం కాకుండా అండర్‌గ్రౌండ్‌లో పనిచేస్తున్నట్లుగా అలవెన్స్‌లతో సహా జీతం తీసుకుంటున్నారు. ఇలా సంస్థ వ్యాప్తంగా రూ.80 లక్షల మేర అదనంగా చెల్లించినట్లు బయటపడింది. దీంతో ఆడిట్ అధికారులు ఆయా సిబ్బంది నుంచి సొమ్ము రికవరీ చేయడానికి రంగం సిద్ధం చేశారు.

వందల సంఖ్యలో గైర్హాజరు

సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలు పొందినప్పుడు ఉన్న ఉత్సాహం ఆతర్వాత పలువురిలో ఉండడం లేదని తెలుస్తోంది. గడిచిన తొమ్మిది మాసాల్లో సుమారు 700 మందికి ఇప్పటి వరకు ఒక్క మస్టర్ కూడా నమోదు కాలేదు. సుమారు 4వేల మంది 100 మస్టర్లు కూడా పూర్తిచేయలేదు. వీరు కూడా తల్లితండ్రుల ఒత్తిడి, సస్పెన్షన్ భయంతో 100 మస్టర్లు పూర్తిచేసినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా మరికొందరు యువ ఉద్యోగులు డ్యూయల్ ఉద్యోగాలు చేస్తున్నట్లు సమాచారం. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూనే వారాంతాల్లో సింగరేణి ఉద్యోగానికి హాజరై రెండేసి మస్టర్లు నమోదు చేయించుకుంటున్నారని సమాచారం. కొత్త ఉద్యోగులు వస్తే సంస్థ లక్ష్యాల మేరకు ఉత్పత్తి సాధించొచ్చని యాజమాన్యం భావిస్తుండగా.. ఆ పరిస్థితి కానరావడం లేదు. దీంతో చివరి అస్త్రంగా ప్రతీ కొత్త ఉద్యోగి అండర్ గ్రౌండ్ ఐదేళ్లు పనిచేయాలనే నిబంధన అమలుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

గైర్హాజరైనా, నిర్లక్ష్యం చేసినా శాఖాపరమైన చర్యలు



సంస్థ ఉద్యోగులంతా విధుల్లో నిబద్ధత, సమయపాలన పాటించాలి. అలా చేయకున్నా విధులకు గైర్హాజరైనా శాఖాపరమైన చర్యలు ఉంటాయి. అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నప్పుడు ఉద్యోగులు, కార్మికులు సంస్థ అభివృద్ధిలో భాగం కావాలి. ఇక నుండి కొత్త ఉద్యోగులు కచ్చితంగా ఐదేళ్లు భూగర్భ గనుల్లో పనిచేయాల్సిందే.

– బలరామ్, సింగరేణి సీఎండీ

కాలిస్తే కాలుష్యం ముప్పు



పంట అవశేషాలను కాలుస్తున్న దృశ్యం



రొటోవేటర్‌తో పంట అవశేషాలను భూమిలో కలియదున్నుతున్న రైతు

- వరికొయ్యలను కాల్చకుండా కలియదున్నితే మేలు
- తద్వారా పెరగనున్న భూసారం
- వైరా కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ రవికుమార్ సూచనలు

వైరా: ఉమ్మడి జిల్లాల్లో వానాకాలంలో ఎక్కువగా వరి, పత్తి సాగు చేశారు. అయితే, ఈ పంటల్లో ఉత్పత్తి తీశాక.. 80 నుంచి90 శాతం పంట వ్యర్థాలు, అవశేషాలు మిగిలిపోతాయి. సుమారు ఒక హెక్టార్‌లో పండించిన వరి పంట ద్వారా 6–7.5 టన్నులు, పత్తి ద్వారా 2–3 టన్నుల అవశేషాలు ఉత్పన్నమవుతాయని అంచనా. ఇందులో కొంతమేర పశువుల మేత, ఇంకొంత పరిశ్రమల ఉపయోగాలకు, మరికొంత గృహోపయోగాలకు వినియోగిస్తున్నారు. మిగతాది ఏం చేయాలో చాలా మంది రైతులకు అవగాహన లేక కాల్చేస్తున్నారు. దీంతో వాయుకాలుష్యం ఉత్పన్నమవుతోంది. అంతేకాక పంటలకు ఉపయోగపడే మిత్ర పురుగులు నశించిపోతాయి. అలాకాకుండా అవశేషాలను కలియదున్నితే భూసారం పెరిగి రైతులకు మేలు జరుగుతుందని వైరా కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి.

అవశేషాలను తగలబెట్టడానికి కారణాలు


- వరిని కంబైన్డ్ హార్వెస్టర్‌తో కోసినప్పుడు మొదలు కాకుండా 30 సెం.మీ. ఎత్తులో కోస్తున్నాయి. దీంతో గడ్డి అక్కడే పడిపోతోంది. ఆపై ఎండుగడ్డి కట్టలు కట్టే ప్రక్రియ సరిగాసాగక 50శాతం పొలంలోనే మిగులుతోంది. హెక్టార్‌కు 6–7.5 టన్నుల మేర మిగులుతుండగా.. ఆపై రైతులు గడ్డి, కొయ్యలను తగలబెడుతుండడంతో పశుసంపదకు మేతకోసం కొనుగో లు చేయాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి.
- పంట కోశాక వేరే పంటను వేసుకోవడానికి సమయం తక్కువ ఉంటుంది. దీంతో పంట వ్యర్థాలు కుళ్లడానికి సమయం పడుతుండడంతో.. ఆ సమయాన్ని ఆదా చేసేందుకు రైతులు అవశేషాలను కాలుస్తున్నారని గుర్తించారు.

ఇవీ నష్టాలు

- ఒక టన్ను వరిగడ్డి కాల్చడం వలన 5.5 కిలోల నత్రజని, 2.3 కిలోల భాస్వరం, 25 కిలోల పోటాషియం, 1.2 కిలోల సేంద్రియ కార్బన్‌ను కోల్పోయినట్లే. అలాగే, 60 కిలోల కార్బన్ మోనాక్సైడ్, 1,640 కిలోల కార్బన్ డయాక్సైడ్, 199 కిలోల బూడిద, 2 కిలోల సల్ఫర్ డయాక్సైడ్ వాతావరణంలోకి విడుదలై వాయు కాలుష్యం ఏర్పడుతుంది.
- వాయు కాలుష్యం మనుషుల ఊపిరితిత్తులపై ప్రభావం పడుతుంది. అంతేకాక మండే అవశేషాల నుంచి వచ్చే వేడి నేల ఉష్ణోగ్రతను పెంచి పంటలకు ఉపయోగపడే సూక్ష్మజీవులు మరణిస్తాయన్నారు. గ్రీన్ హౌస్ వాయువులు, ఇతర విష వాయువులు విడుదలై వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటాయి.

ఇలా ఉపయోగించుకోవాలి..

- స్వల్పకాలిక వరి రకాలను ఎంచుకుంటే త్వరగా కోతలు పూర్తిచేసి అవకాశాలను నేలలో కలియదున్నొచ్చు.
- కొయ్య కాళ్లను భూమిలో కలియదున్నితే గడ్డి ద్వారా పోషకాలు తిరిగి నేలకు చేరతాయి. పొలం దున్నే 10 రోజుల ముందు గడ్డిని పొలంలో పరిచి నీరు, ఎకరాకు 50 కిలోల సూపర్ ఫాస్ఫేట్ చల్లితే భూమి దెబ్బతినకుండా సేంద్రియ పదార్థాల స్థాయి పెరుగుతుంది.
- పంట మార్పిడి చేయడం ద్వారా పంట అవశేషాల యాజమాన్యం సులువవుతుంది. అవశేషాలను వర్మీ కంపోస్ట్ లేదా బయోచర్ లేదా బయోగ్యాస్ తయారీలో ఉపయోగించుకోవచ్చు.
- వరి కోత యంత్రాలకు గడ్డిని చిన్న ముక్కలుగా చేసే పరికరాన్ని అమరిస్తే అవశేషాలు త్వరగా విచ్ఛిన్నమవుతాయి.
- వరి పంట కోశాక దున్నకుండానే మొక్కజొన్న పంటను జీరో టిల్లేజ్ పద్ధతిలో సాగు చేయొచ్చు.
- హెక్టారు పత్తి పంటలో సుమారు 2 టన్నుల అవశేషాలు ఉత్పత్తి అయితే.. కాల్చడం వల్ల 12.4–20 కిలోల నత్రజని, 1.6 కిలోల భాస్వరం, 12.2–13.6 కిలోల పొటాష్ భూమికి అందకుండా వృథా అవుతుంది. అందుకే పత్తి మొదళ్లను రోటవేటర్, ష్రెడ్డర్‌తో భూముల్లో కలియదున్నాలి.
- అంతేకాక పంట అవశేషాలను వివిధ పరిశ్రమలకు ముడి సరుకుగా వినియోగిస్తే రెండు విధాలుగా లాభం జరుగుతుంది.



రామాలయాన్ని కమ్మేసిన మంచు

భద్రగిరిని కమ్మేసిన మంచు!

చలికాలం మొదలై చాన్నాళ్లయినా వారం రోజులుగా చలి తీవ్రత పెరిగింది. రోజంతా సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా సాయంత్రం దాటాక గంటగంటకు చలి పెరుగుతోంది. ఇక సోమవారం చాలాచోట్ల ఉదయం ఏడు గంటల వరకు కూడా మంచుతెరలు వీడలేదు. భద్రాచలం పుణ్యక్షేత్రంలోనూ ఇదే పరిస్థితి నెలకొనగా.. కార్తీక మాసం కావడంతో చలిలోనూ భక్తులు తెల్లవారుజామునే పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు బారులుదీరారు. మరోపక్క పిల్లలు, పెద్దలు మైదానంలో వాకింగ్ చేస్తూ కనిపించారు. – భద్రాచలం



పవిత్ర గోదావరి తీరంలో మంచు తెరలు